




అర్ధాంతరంగా నిలిచిపోయిన సంకిలి రహదారి పనులు

ఓటు వేయాలంటే
కొండలు దిగి ఎక్కాల్సిందే...

- కిలోమీటర్ల మేర నడవాల్సిన పరిస్థితి
- గిరిశిఖర గ్రామస్థులకు తప్పని అవస్థలు
- విద్య, వైద్యం, రేషన్ సరుకులకు ఇబ్బందులు
- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రోడ్ల నిర్మాణానికి చర్యలు
- వైసీపీ అధికారంలోకి వచ్చాక పనులకు బ్రేక్
- ఐదేళ్లూ వాటిపై దృష్టి సారించని వైసీపీ ప్రభుత్వం
- స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోని వైనం
- సర్కారు తీరుపై గిరిజనుల ఆగ్రహం



ఓటు వేయాలంటే రంగంవలస గిరిజనులు ఈ కొండలపై నుంచి రావాల్సిందే..

(సీతంపేట)

'గిరిజనుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తాం.. ఏజెన్సీ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తాం' అని గత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన జగన్.. అధికారంలోకి వచ్చాక అసలు రూపం చూపించారు. గిరిజనులకు ఇచ్చిన హామీలను పూర్తిగా మారిచారు. అభివృద్ధి పనుల మాట పక్కన పెడితే.. కనీసం మౌలిక వసతుల కల్పనకు కూడా చొరవ చూపలేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన రోడ్ల పనులు కూడా ఐదేళ్ల కాలంలో పూర్తి చేయలేక పోయారు. దీంతో సీతంపేట మండలంలో గిరిశిఖర గిరిజన గ్రామస్థులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు సదుపాయం లేకపోవడంతో అత్యవసర వేళల్లో వారికి డోలీలే దిక్కవుతున్నాయి. విద్య, వైద్యానికే కాదు ఓటు వేయడానికి కూడా వారు ఐదు కొండలు ఎక్కి, దిగాల్సి వస్తోంది. రేషన్ సరుకులు కూడా వారు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఐదేళ్లుగా అవస్థలు పడుతున్నా.. వైసీపీ సర్కారు, స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంపై గిరిజనులు మండిపడుతున్నారు.



డోలీ సాయంతో గర్భిణీని ఆసుపత్రికి తీసుకెళ్తున్న ఎగువద్వారబంధం గిరిజనులు (ఫైల్)



కొత్తగా మూలగూడలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం

ఇదీ సంగతి..

సీతంపేట మండల కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో పెద్దసంకిలి, దిగువ సంకిలి, నడమిసంకిలి, రంగంవలస, ఉసిరికిపాడు, పెద్దగూడ గిరిశిఖర గ్రామాలున్నాయి. వారంతా ఏ అవసరమైనా ఐదు కొండలు దాటి మైదాన ప్రాంతాలకు చేరుకోవాల్సి వస్తోంది. ఎగువ ద్వారబంధం, గూడంగి గ్రామాలకు చెందిన వారు కూడా మూడు కొండలు ఎక్కి దిగాల్సి వస్తోంది. ఓటు హక్కును వినియోగించుకునేందుకు కూడా సుమారు ఆరు నుంచి ఎనిమిది కిలోమీటర్లు నడవాల్సిన పరిస్థితి. ఐదు కొండల దిగువ ప్రాంతంలో ఉన్న మర్రిపాడు, చిన్నబగ్గ పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటు వేయాల్సి ఉండగా.. వృద్ధులు, దివ్యాంగులు, బాలింతలు, గర్భిణులకు ఇబ్బందులు తప్పడం లేదు.

- ఈ సమస్యలను దృష్టిలో పెట్టుకున్న గత టీడీపీ ప్రభుత్వం ఆయా గిరి శిఖర గ్రామాలకు రోడ్లు వేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఉపాధి హామీ పథకం కింద బొండిగూడ నుంచి రంగంవలస, ఎగువ సంకిలి వరకు రహదారిని మంజూరు చేశారు. ఈ పనులను ఐటీడీఏ గిరిజన ఇంజనీరింగ్ శాఖకు అప్పగించారు. దీంతో గిరిజనులు ఎంతో సంతోషించారు. తమ కష్టాలు తీరుతాయని భావించారు. అయితే వారి ఆనందం ఎంతో కాలం నిలవలేదు.
- వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పనులకు బ్రేక్ పడింది. రహదారి నిర్మాణం పూర్తికాకపోవడం వాహనాలు కూడా వెళ్లలేని పరిసితి నెలకొంది. దీంతో ఆయా గ్రామస్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఓటు వేయడానికే కాదు.. నిత్యం విద్య వైద్య అవసరాలకు, రేషన్ కోసం ఐదు కొండలు దిగి, ఎక్కాల్సి వస్తోందని గిరిజనులు వాపోతున్నారు. ఐదేళ్లుగా అవస్థలు పడుతున్నా.. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- కాగా ఇటీవల మూలగూడలో కొత్తగా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినప్పటికీ... ఎటువంటి ప్రయోజనం లేదని, అది కూడా తమ గ్రామాలకు దూరంగానే ఉందని వారు వాపోతున్నారు. బొండిగూడలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తే మూడు కిలోమీటర్ల మేర దూరం తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు. మిగతా గ్రామాల్లో పోలింగ్ కేంద్రానికి శాశ్వత భవనం లేదని, మూలగూడలో అంగన్‌వాడీ భవనం ఉండడం వల్లే ఆ గ్రామంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాల్సి వచ్చిందని మరోవైపు అధికారులు చెబుతున్నారు.
- కొత్తగా ఏర్పాటు చేసిన మూలగూడ పోలింగ్ కేంద్రంలో 488 మంది గిరిజనులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో పురుషులు 222 మంది, స్త్రీలు 266 మంది ఉన్నారు. వారంతా కొండ శిఖర గ్రామాలైన రంగంవలస, ఉసిరికిపాడు, ఎగువద్వారంధం, దిగువద్వారబంధం గ్రామాలకు చెందిన ఓటర్లు . మరోపక్క ఎగువ సంకిలి, దిగువసంకిలి, నడిమిసంకిలి గ్రామాలకు చెందిన 150 మంది ఓటర్లు ఎనిమిది కిలోమీటర్లు దూరంలో ఉన్న చిన్నబగ్గ పోలింగ్ కేంద్రానికి వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే ఏదేమైనా వారంతా ఓటు వేయాలంటే ఎన్నో పాట్లు పడాల్సి ఉంది. ప్రధానంగా మూడు నుంచి ఐదు కొండలను దిగి ఎక్కాల్సి ఉంది.
- వ్యయ ప్రయాసలు పడి ఓటు హక్కును వినియోగించుకున్నా... ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు తమ గ్రామాలకు రోడ్డు సదుపాయం కల్పించడం లేదని రంగంవలస తదితర గ్రామాలకు చెందిన గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- అత్యవసర పరిస్థితుల్లో వైద్యం కోసం డోలీ సాయంతో మర్రిపాడు , కొత్తూరు పీహెచ్‌సీలకు చేరుకోవాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. గత ఎన్నికల్లో తమకు హామీలు గుప్పించి ఓట్లు వేయించుకున్న నాయకులు.. ఐదేళ్ల కాలంలో ఎటువంటి అభివృది కార్యక్రమాలు చేపట్ట లేదని ఆయా ప్రాంత గిరిజనులు తెలియజేస్తున్నారు.

ప్రభుత్వం పట్టించుకోలే..

ఎగువద్వారబందం నుంచి మూలగూడ పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేయాలంటే నాలుగు కిలోమీటర్లు దూరం నడిచి వెళ్లాలి. మూడు కొండ లు ఎక్కి దిగాల్సి ఉంది. రహదారి పనులు అర్ధాంతరంగా నిలిచిపోవ డంతో వాహన సౌకర్యం కూడా లేదు. గర్భిణులను డోలీ సాయంతో ఆసుపత్రికి తరలించాల్సి వస్తోంది. అయినా స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం.

-బిడ్డిక గణేష్, ఎగువ ద్వారబంధం

ఇబ్బందులు పడుతున్నాం..

మా గ్రామం నుంచి పోలింగ్ కేంద్రానికి వెళ్లాలంటే ఐదు కొండలు దాటి ఆరు కిలోమీటర్లు నడవాలి. మూలగూడ పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేయాల్సిన పరిస్థితి. రహదారి సౌకర్యం లేకపోవడంతో ఐదేళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

-సవర సుక్కయ్య, రంగంవలస

మొదటిరోజు 48.65 శాతం

పార్వతీపురం, మే5 (ఆంధ్రజ్యోతి)/ పాలకొండ/సాలూరు/కురుపాం: జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియ ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. సాలూరు నియోజకవర్గంలో 1,291 ఓట్లకు 546, పార్వతీపురంలో 1,741 ఓట్లకు 1098 ఓట్లు పడ్డాయి. కురుపాం నియోజకవర్గంలో 2,241 ఓట్లకు 925, పాల కొండలో 1,500 ఓట్లకు గాను 726 ఓట్లు పోలయ్యాయి. తొలిరోజు 48.65 శాతంగా పోలింగ్ నమోదైంది. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటింగ్ జరిగింది. 6న పోలీస్ సిబ్బంది, 7న డ్రైవర్లు, వీడియో గ్రాఫర్లుతో పాటు ఇతర సిబ్బంది ఆయా కేంద్రాల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా పార్వతీపురం, కురుపాం, పాలకొండ నియోజకవర్గాల పరిధిలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ నిశాంత్‌కుమార్ పరిశీలించారు.

- **పోస్టల్ బ్యాలెట్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్**

పాలకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలింగ్ మూడు బూత్‌లను ఆయన సందర్శించి సిబ్బందికి పలు సూచనలు అందించారు. పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. 5, 6, 7 తేదీల్లో జరగనున్న పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తప్పులు దొర్లకుండా ఎన్నిక ప్రక్రియ సజావుగా సాగాలని సూచించారు.

మరో అవకాశం

గరుగుబిల్లి : ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌కు రాష్ట్ర ఎన్నికల సంఘం మరొక అవకాశం ఇచ్చింది. ఇప్పటివరకు ఫారం-12 అందించని వారు.. ఈ నెల 7, 8 తేదీల్లో సమర్పించొచ్చని ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు సంబంధిత ఉద్యోగులు నియోజకవర్గంలో ఎన్నికల అధికారిక అవసరమైన సమాచారం అందిస్తే.. పోస్టల్ బ్యాలెట్‌ను వేసేందుకు అవకాశం కల్పించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల్లోపు ఓటు హక్కును వినియోగించుకోవచ్చు.



పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ఏనుగుల సంచారం.. పంటలు ధ్వంసం

కొమరాడ/భామిని, మే 5 : కొమరాడ, భామిని మండలాల్లో ఏనుగుల సంచారంతో పంటలు పాడవుతున్నాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. పొలాల్లోకి వెళ్లలేక.. పంటలను కాపాడుకోలేక తీవ్రంగా నష్టపోతున్నామని వాపోతున్నారు. కాగా ఆదివారం కొమరాడ మండలంలో పూజారిగూడ, వన్నాం, పాలెం, మాదలంగి, తదితర గ్రామాల్లో వరి, మొక్కజొన్న, అరటిని గజరాజులు ధ్వంసం చేశాయి. మరోవైపు భామిని మండలం తాలాడ, బాలేరు ప్రాంతాల్లో ఏనుగుల కారణంగా మామిడి తోటలు, మొక్కజొన్న, చెరకు పంటకు నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. మరికొద్ది రోజుల్లో పంటలు చేతికొస్తాయన్న తరుణంలో ఏనుగులు వాటిని ఆరగించడంతో పాటు తొక్కి పాడు చేసినట్లుగా వారు చెబుతున్నారు. కాగా ఆదివారం సాయంత్రానికి బాలేరు చెరకు తోటలోకి గజరాజులు రావడంతో ఆ గ్రామస్థులు తీవ్ర భయాందోళన చెందారు. ఈ లోపుగా అవి ఏబీ రోడ్డు సమీపంలోకి చేరుకోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. అయితే వాటిని చూసేందుకు కొందరు దగ్గరగా వెళ్లగా ఏను గులు ఘీంకరించాయి. దీంతో వారంతా పరుగులు పెట్టారు. ఆ తర్వాత గజరాజులు సమీప తోటల్లోకి వెళ్లిపోయాయి. తక్షణమే ఏనుగులను ఈ ప్రాంతం నుంచి తరలించాలని ఆయా మండలాల వాసులు డిమాండ్ చేస్తున్నారు.



పూజారిగూడ పొలాల్లో సంచరిస్తున్న ఏనుగులు

ప్రలోభాలకు దూరం..
అభివృద్ధికే పట్టం



- వైసీపీ తాయిలాలకు తలవంచని ఓటర్లు
- ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని ఆ పార్టీ నేతల ప్రయత్నాలు
- తిప్పికొడుతున్న ప్రజలు
- మరో అవకాశం ఇవ్వలేమంటూ వెల్లడి
- తమ భవిష్యత్‌కు ప్రాధాన్యమిచ్చే వారికే ఓటు వేస్తామంటూ స్పష్టం

(పార్వతీపురం- ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక పోరు సమయం దగ్గర పడింది. పోలింగ్‌కు పట్టుమని వారం రోజుల వ్యవధి కూడా లేదు. అయితే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్న విషయం గ్రహించిన వైసీపీ సర్కారు ప్రలోభాల పర్వానికి తెరతీసింది. తమ పార్టీ నేతల ద్వారా తాయిలాల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఎన్నికల పోరులో ఎలాగైనా గెలవాలనుకుంటున్న వైసీపీ సర్కారు అడ్డదారుల్లో ప్రయత్నాలకు శ్రీకారం చుట్టింది. అయితే ఐదేళ్ల కాలంలో ఏమీ చేయని ప్రభుత్వంపై అన్ని వర్గాల వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓటుతో గట్టిగా బుద్ధి చెప్పేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలోనే అత్యధిక శాతం ప్రజలు ఆ పార్టీ నేతల ప్రలోభాలకు దూరంగానే ఉంటున్నారు. 'మాకు తాయిలాలు వద్దు.. అభివృద్ధి కావాలి' అంటూ స్పష్టం చేస్తున్నారు.

సంక్షేమం.. అభివృద్ధి ఎక్కడ?

ఏ ప్రభుత్వానికైనా సంక్షేమం, అభివృద్ధి అన్నవి రెండు కళ్లుగా ఉండాలి. కానీ వైసీపీ ప్రభుత్వ పాలనలో మాత్రం అవి మచ్చుకైనా కనిపించని పరిస్థితి. ఆ రెండింటికీ పెద్దపీట వేసినట్లు చెప్పుకుంటున్న సీఎం జగన్ ప్రకటనలకే పరిమితమయ్యారు. ఐదేళ్ల పాలనలో విద్యుత్, ఆర్టీసీ చార్జీలు, నిత్యావసరాల ధరలు, పన్నులతో సామాన్యుల నడ్డి విరిచారు. రోడ్లు, పరిశ్రమలు, సాగు,తాగునీటి ప్రాజెక్టులపై కన్నెత్తి కూడా చూడలేదు. యువతకు ఉపాధి కల్పన ఊసే లేదు. ఇసుక కొత్త విధానంతో భవన నిర్మాణ కార్మికులు, అనుబంధ రంగాలకు చెందిన శ్రామికుల పొట్ట కొట్టారు. ప్రశ్నించే వారిపై దాడులు, అక్రమ కేసులు, గృహ నిర్బంధాలకు తెగబడ్డారు. ఇలా అనేక ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేసిన వైసీపీ సర్కారుపై అన్ని వర్గాల వారు మండిపడుతున్నారు. అయితే మరోవైపు ముఖ్యమంత్రి జగన్‌ప్రచారాల్లో మాత్రం 'మీకు మేలు జరిగితే వైసీపీని గెలిపించండి' అంటూ ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. కాగా క్షేత్రస్థాయిలో నెలకొన్న భిన్న పరిస్థితుల నేపథ్యంలో వైసీపీకి ఓటమి భయం వెంటాడుతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో ఆ పార్టీ అభ్యర్థుల ప్రచారం పద్ధతి, వ్యవహరిస్తున్న తీరే ఇందుకు నిదర్శమని స్పష్టం చేస్తున్నారు.

ఎలాగైనా గెలవాలని..

మెజార్టీ ప్రజలు వైసీపీకి వ్యతిరేకంగా ఉన్నప్పటికీ ఎలాగైనా ఎన్నికల్లో నెట్టుకు రావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో తాయిలాలు, ప్రలోభాలతో ఎర వేస్తున్నప్పటికీ పెద్దగా ప్రయోజనం ఉండడం లేదు. ప్రజలు పెద్దగా స్పందించక పోవడంతో ఎన్నికల బరిలో అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. మరోవైపు జిల్లాలో కొందరు వైసీపీ నేతలు.. టీడీపీ, జనసేన, బీజేపీపై విష ప్రచారం చేస్తున్నారు. కానీ ప్రజలు మాత్రం స్పష్టమైన నిర్ణయంతో ఉన్నారు. వారి మాయ మాటలు నమ్మడం లేదు. అభివృద్ధి లేకుంటే భావితరాలకు భవిష్యత్తు ఉందని జిల్లావాసులు భావిస్తున్నారు. ఇప్పటికే పలుచోట్ల వైసీపీకి వ్యతిరేకంగా గళమెత్తారు.

విష ప్రచారం...

వలంటీర్లతో సామాజిక పింఛన్ల పంపిణీ చేయించరాదని కోర్టు ఆదేశాల ప్రకారం ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకోగా.. ఇదంతా టీడీపీ కుట్రగా వైసీపీ నాయకులు విష ప్రచారం చేశారు. అయితే సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటికీ పింఛన్లు పంపిణీ చేసే అవకాశం ఉన్నప్పటికీ వైసీపీ సర్కారు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. కాగా ఇదంతా వైసీపీ రాజకీయ లబ్ధి కోసమే చేస్తోందన్న విషయాన్ని లబ్ధిదారులు గ్రహించారు. మరోవైపు రెండు నెలలుగా పింఛన్ల పంపిణీలో సర్కారు అవలంభించిన తీరు చూసి పింఛన్‌దారులు మండిపడుతున్నారు. గత నెలలో ఇంటింటికీ పింఛన్లు పంపిణీ చేయగా.. ఈ నెల పింఛన్ సొమ్ము బ్యాంకు ఖాతాలో జమ చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. తమను ఇబ్బందులను గురిచేయడం తగునా? అంటూ పలువురు సర్కారుపై పెదవి విరుస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ తప్పును టీడీపీ, జనసేన, బీజేపీపై వేసి ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందాలని భావించిన వైసీపీకి చుక్కెదురైంది. ఇదంతా ప్రభుత్వ కుట్ర అని సామాజిక పింఛన్‌దారులు అర్థం చేసుకోవడంతో వైసీపీ ప్లాన్ బెడిసి కొట్టింది. మొత్తంగా పింఛనుదారుల నుంచి కచ్చితంగా తమకు ఎన్నికల్లో రిటర్న్ గిఫ్ట్ వస్తుందనే ఆందోళనలో వైసీపీ నాయకులు ఉన్నారు.

మరో అవకాశమా?

జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో వైసీపీ నేతల అక్రమాలకు అడ్డూ ఆపు లేకుండాపోయింది. కాగా వైసీపీ సర్కారు ఐదేళ్ల అధికారంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న జిల్లావాసులు మరో అవకాశం ఇస్తే తమ పరిస్థితేమిటని ఆందోళన చెందుతున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో ప్రజల్లో ఇప్పటికే ఒక అభిప్రాయానికి వచ్చారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చిన వారికే ఓటు వేయాలని భావిస్తున్నారు. అభివృద్ధిని కాదని, తమ పిల్లల భవిష్యత్తును నాశనం చేసుకోలేమని, రాజధాని లేని రాష్ట్రంగా మరో ఐదేళ్లు చెప్పుకోలేమని గోతుల రహదారులపై ప్రయాణించి ప్రమాదాల బారిన పడలేమని, ఉపాధి, ఉద్యోగావకాశాలు లేకుండా ఉండలేమని స్పష్టం చేస్తున్నారు.

ఆ ప్రయత్నాలు విఫలం

కదలలేని దివ్యాంగులు, 85 సంవత్సరాల వృద్ధులకు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. అయితే దీనిని కూడా తమకు అనుకూలంగా మార్చుకునేందుకు వైసీపీ నేతలు ప్రయత్నించారు. ఈ మేరకు జిల్లాలో పలుచోట్ల వలంటీర్లతో ఈ తతంగాన్ని నడిపారు. గ్రామాల్లో వలంటీర్లను దివ్యాంగులు, వృద్ధులకు వద్దకు పంపించి.. ఫారం-12 దరఖాస్తులపై వారికి తెలియకుండానే సంతకాలు చేయించి పోస్టల్ బ్యాలెట్‌లో వైసీపీకి లబ్ధి చేకూర్చేందుకు యత్నించారు. ముఖ్యంగా జిల్లాలోని పార్వతీపురం నియోజకవర్గంలో ఈ ప్రక్రియ ప్రారంభమైంది. అనంతరం మిగిలిన నియోజకవర్గాల్లో కూడా ఈ ప్రక్రియ వేగవంతం చేసేందుకు కొంతమంది వైసీపీ నాయకులు చేసిన ప్రయత్నాలు అన్నీ ఇన్నీ కావు. అయితే చాలా చోట్ల దివ్యాంగులు, వృద్ధులు దీనిని వ్యతిరేకించడంతో వైసీపీ నేతలు ఖంగుతిన్నారు. మరోవైపు టీడీపీ నేతలు కూడా అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆ పార్టీ నాయకుల ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీంతో తమకు ఈ ఎన్నికల్లో ఎదురీత తప్పదని భావించిన కొందరు వైసీపీ నాయకులు టీడీపీ, జనసేన పార్టీలోకి చేరడం ప్రారంభించారు.



తమకే ఓటు వేయాలంటూ..

ఎన్నికల్లో తమకు నచ్చిన వారికి ఓటు వేసుకునే హక్కు అందరికీ ఉంది. అదే విధంగా బహిరంగంగా తమకు నచ్చిన పార్టీలకు ప్రచారం చేసుకొనే స్వేచ్ఛ ఉండేది. కానీ వైసీపీ పాలనలో ఆ పరిస్థితి లేకుండా పోయింది. కొన్ని నియోజకవర్గాల్లో వైసీపీ నాయకులు తమకే ఓట్లు వేయాలని ఒత్తిడి తెస్తున్నారు. దౌర్జన్యాలకు పాల్పడి అడ్డదారిలో గెలిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వారి తీరుపై జిల్లావాసులు పెదవి విరుస్తున్నారు. ఓటుతో వారికి సరైన సమాధానం చెబుతామంటున్నారు. ప్రజల స్వేచ్ఛను హరిస్తూ.. అరాచక పాలనకు దిగిన వైసీపీ ప్రభుత్వానికి ఇంటికి పంపించేందుకు సిద్ధంగా ఉన్నామంటూ స్పష్టం చేస్తున్నారు. కాగా ప్రజలు తమ వెంటే ఉన్నారని.. అన్ని వర్గాల వారు వైసీపీకే ఓటు వేస్తారని సీఎం పదే పదే చెప్పుకొస్తున్నారు. అయితే అంత నమ్మకం ఉండగా.. ఎన్నికల్లో ఎలాగైనా గెలిచేందుకు ఈ అడ్డదారులు తొక్కడం ఎందుకని రాజకీయ విశ్లేషకులు, మేధావులు ప్రశ్నిస్తున్నారు.

ఉద్యోగాలు కావాలి

మా పిల్లలకు భవిష్యత్‌లో ఉద్యోగాలు కావాలి. సంక్షేమ పథకాలతో అభివృద్ధి కూడా ముఖ్యం. వైసీపీ ప్రభుత్వ పాలనలో పూర్తిగా అభివృద్ధి లేదు.

- రామకృష్ణ, పార్వతీపురం మండలం

పథకాలతోనే బతకలేం

రాష్ట్ర అభివృద్ధి జరిగితే.. ఉపాధి అవకాశాలు కలుగుతాయి. కేవలం సంక్షేమ పథకాల మీదే ఆధారపడి బతకలేము. ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించే విధంగా పరిశ్రమలు ఏర్పాటు చేయాలి.

- రాము, పాలకొండ

అభివృద్ధి పనులేవీ?

వైసీపీ పాలనలో అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో రోడ్లు అధ్వానంగా మారాయి. దీంతో ప్రయాణాలు చేయాలంటేనే భయమేస్తోంది. భవిష్యత్‌లో ఈ పరిస్థితి ఉండకూడదని ఆశిస్తూ.. మంచి పాలకులను ఎన్నుకుంటాం.

- ప్రభాకరరావు, కురుపాం

పీపుల్స్ మేనిఫెస్టో

వ్యవసాయానికి సాయపడాలి



సాలూరు రూరల్: వ్యవసాయానికి ప్రభుత్వం సాయపడాలి. ఎన్నికల సమయంలో ప్రకటనలకే పరిమితం కాకూడదు. దుక్కి నుంచి పంట అమ్మకం వరకు ప్రభుత్వ పరంగా చేయూత నందించాలి. ఆరుగాలం కష్టించి పండించినా పరపతి ఉన్నవారికి ఒకలా, లేని వారికి మరోలా కొనుగోలు కేంద్రాలు వద్ద చూస్తున్నారు. రైతు అనే ప్రతి ఒక్కరికి సులభరీతిలో ప్రభుత్వం నుంచి చేయూత అందాలి. తద్వారా వ్యవసాయంపై రైతులకు ఆసక్తి పెరుగుతోంది. ఇప్పటికే వ్యవసాయంపై రైతులకు ఆసక్తి తగ్గిపోతుంది. ఈ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రానున్న తరానికి వ్యవసాయం ఆసక్తి పెంచేలా చర్యలు తీసుకోవాలి.

- మర్రి రాము, రైతు, గుర్రప్పవలస

నువ్వెక్కడుంటే.. నేనక్కడుంటా..!

- **చెరువులు, పొలాల్లో ప్రచారం**
- **ఓటర్ల ప్రాపకం కోసం అభ్యర్థుల పాట్లు**

(చీపురుపల్లి)

పోలింగ్ తేదీ సమీపిస్తుండడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచార జోరును పెంచారు. మరో ఐదు రోజుల్లో ప్రచారం కూడా నిలిపివేయాల్సి ఉండడంతో అభ్యర్థులు, నాయకులు ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. ఎండలు అతి తీవ్ర రూపం దాల్చడాన్ని దృష్టిలో పెట్టుకొని ఇప్పటికే ప్రచార సమయాలను వాతావరణానికి అనుగుణంగా మార్చుకున్నారు. ఇప్పుడు ఓటర్లు ఎక్కడుంటే అక్కడికే పరుగులు తీస్తున్నారు. ప్రస్తుతం అంతటా ఉపాధి హామీ పనులు ముమ్మరంగా జరుగుతుండడంతో, అధిక సంఖ్యలో ఉన్న వేతనదారులు, పొలం పనులకు వెళ్తున్న వ్యవసాయ కూలీలు, వ్యవసాయదారులను కలవడం కోసం చెరువులు, పొలాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఏ రోజు ఎక్కడ ఉపాధి పనులు జరుగుతున్నాయో తెలుసుకొని సంబంధిత గ్రామ నాయకులను తీసుకొని అభ్యర్థులు ప్రచారానికి బయలుదేరుతున్నారు. వేతనదారులతో మాట్లాడుతూ వారి సమస్యలను తెలుసుకుంటున్నారు. పార్టీ అధికారంలోకి వస్తే.. ముందుగా ఉపాధి వేతనదారుల సమస్యలు పరిష్కరించడానికి చొరవ తీసుకుంటామని హామీ ఇస్తున్నారు. వలస ఓటర్లను గుర్తించి, సంఖ్యను బట్టి వారు నివాసం ఉండే ప్రాంతాలకు కొంతమంది అభ్యర్థులు తమ మనుషులను పంపించి మాట్లాడిస్తున్నారు. లేదా వారే స్వయంగా వెళ్లి ఓటర్లను కలుస్తున్నారు. పార్టీలు ప్రకటించే మేనిఫెస్టోతో పాటు తాము గెలిస్తే, వ్యక్తిగతంగా ఏదో ఒకటి చేస్తామని హామీ ఇస్తున్నారు. పోలింగ్ తేదీ నాటికి గ్రామానికి వచ్చి తమకు ఓటేయాల్సిందిగా ప్రాధేయపడుతున్నారు. ఎన్నికల్లో గెలిచి, అధికారం చేతికొచ్చాక, తమ అపాయింట్‌మెంట్ కోసం చుక్కలు చూపించే నాయకులు... ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండడంతో ఓటర్ల అపాయింట్‌మెంట్ కోసం తహతహలాడడం విస్తుగొలుపుతోంది.



ఓటు పండగ మొదలైంది!

- **ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ పోలింగ్**
- **భారీ స్థాయిలో వినియోగించుకున్న ఎన్నికల సిబ్బంది**

సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఆదివారం పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలో ఉండి ఓటు వేశారు. మరో మూడు రోజుల పాటు ఈ ప్రక్రియ సాగుతుందని ఎన్నికల అధికారులు తెలిపారు.

ఎస్.కోటలో 563 మంది..

శృంగవరపుకోట: శృంగవరపుకోట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఆదివారం 563 మంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. ఈ నియోజకవర్గపరిధిలో 1776 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఓటింగ్ సరళిని పరిశీలించేందుకు టీడీపీ, వైసీపీ నేతలు ఫెసిలిటేషన్ సెంటర్‌ల వద్ద తిష్ట వేశారు. వైసీపీ నేతలు ఉద్యోగులను ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నించారు. కానీ వీరి ప్రలోభాలకు ఓటర్లు లొంగలేదు. టీడీపీ అభ్యర్థి కోళ్ల లలిత కుమారి పోస్టల్ ఓట్ల సరళిని పరిశీలించేందుకు విశాఖ-అరుకు రోడ్డుకు ఓ వైపు కూర్చొని పరిశీలించారు.

రాజాంలో 746 ఓట్లు

రాజాం రూరల్, మే 5: రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9 నుంచి సాయంత్రం అయిదు గంటల వరకూ జరిగిన పోలింగ్‌లో ఉద్యోగవర్గాలు ఉత్సాహంగా పాల్గొన్నారు. రాజాం నియోజవర్గానికి సంబంధించి మొత్తం 1,741 మందికి గాను 746 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని రిటర్నింగ్ అధికారి జోసెఫ్ తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులను పోలింగ్ కేంద్రంలోని హెల్ప్‌డెస్క్‌కే పరిమితం చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి జోసెఫ్‌తో పాటు రాజాం తహశీల్దార్ కృష్ణంరాజు పర్యవేక్షించారు. రాజాం టౌన్ సి.ఐ. దాడి మోహనరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



రాజాం: ఓటుహక్కు వినియోగించుకున్న మహిళా ఉద్యోగులు



విజయనగరంలో..



పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ హెల్ప్ డెస్క్‌ను పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి నూకరాజు

తొలిరోజు 587 మంది..

నెల్లిమర్ల, మే 5: నెల్లిమర్ల: నెల్లిమర్ల అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి స్థానిక సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో తొలి రోజు ఆదివారం 587 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 1906 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ ప్రక్రియను పర్యవేక్షించేందుకు అన్ని రాజకీయ పార్టీల ఏజెంట్లు హాజరయ్యారు. టీడీపీ సీనియర్ నాయకుడు, పోల్ మేనేజ్‌మెంటు కోఆర్డినేటర్ సువ్వాడ రవిశేఖర్, మండల కమిటీ అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్, పార్టీ నాయకులు గేదెల రాజారావు, లెంక అప్పలనాయుడు, రెడ్డి వేణు, కాళ్ల రాజశేఖర్, బయిరెడ్డి కళ్యాణ్ తదితరులు హాజరయ్యారు. పోలింగ్ విధులకు హాజరు కానున్న ఉద్యోగులు 8వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందని రిటర్నింగ్ అధికారి నూకరాజు తెలిపారు.



ఎస్.కోట: ఫెసిలిటేషన్ సెంటర్‌కు ఓటు వేసేందుకు వచ్చిన ఉద్యోగులు



విజయనగరంలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఉద్యోగులు

పథకాలను ప్రజలకు చేరువ చేస్తా

- **మహిళా సంక్షేమానికి ప్రాధాన్యం**
- **యువతకు ఉపాధి కల్పన..**
- **గిరిజన గ్రామాలకు రహదారుల నిర్మాణం**
- **పూర్ణపాడు - లాబేసు వంతెన నిర్మాణం పూర్తి**
- **ఇవీ నా ముందు ఉన్న లక్ష్యాలు**
- **'ఆంధ్రజ్యోతి'తో కురుపాం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి**

కొమరాడ: 'ఐదేళ్ల వైసీపీ పాలన ప్రజలకు నరకాన్ని చూపించింది. ఒక్క అవకాశం అంటూ గద్దెనెక్కి... ఆపై జలగల్లా ప్రజలను పీడించారనే చెప్పాలి. ఎంత ఘోరమంటే ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ అంటూ ప్రకటించి నిరుద్యోగ యువతను మోసం చేశారు. ఇక ఉద్యోగులకు పెట్టిన బాధలు వర్ణనాతీతమే. ఉపాధ్యాయులు పిల్లలకు పాఠాలు చెప్పడం మరిచి యాప్‌లతో ఆపసోపాలు పడే పరిస్థితి తీసుకువచ్చారు. పాఠశాలలు విలీనం అంటూ విద్యకు ఉరి వేశారు. ఉప ప్రణాళిక నిధులు దారి మళ్లించారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఒక్కటేమిటి అన్ని రంగాలను నాశనం చేశార'ని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కురుపాం నియోజకవర్గ అభ్యర్థి తోయక జగదీశ్వరి పేర్కొన్నారు. తనను గెలిపిస్తే చేపట్టబోయే పనులను..ప్రాధాన్య అంశాలను 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...

మహిళలను మహారాణుల్లా చూసుకుంటాం

తెలుగుదేశం ఆవిర్భావం నుంచి మహిళలకు అనేక రంగాల్లో ప్రాధాన్యం ఇస్తున్నాం. చంద్రబాబు సీఎం కాగానే అమ్మకు వందనం, జిల్లాలో ఉచిత బస్సు ప్రయాణం, ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తాం. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.15 వేలు ఇస్తాం.

యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

జగన్ పాలనలో రాష్ట్రంలో పారిశ్రామికీకరణ కుంటుపడింది. ముఖ్యంగా మన్యం జిల్లాలో ఐదేళ్ల కాలంలో ఒక్క కుటీర పరిశ్రమ కూడా రాలేదు. నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్య ఉంది. ప్రత్యేక డీఎస్సీ లేకపోవడంతో పాటు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకపోవడంతో వారంతా గ్రామాల్లో ఉపాధి పనులకు వెళ్లవలసి వస్తోంది. టీడీపీ అధికారంలో చేపట్టిన తరువాత నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు భృతి కల్పిస్తాం. గుమ్మలక్ష్మీపురం మండలంలో జీడి పిక్కల పరిశ్రమ స్థాపనకు కృషి చేస్తాం. గిరిజనులకు అండగా ఉంటూ చట్టాలకు రక్షణ కల్పిస్తాం.

గిరి శిఖర గ్రామాలకు రహదారులు

గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ముఖ్యంగా రహదారి సౌకర్యం ఉండాలి. కురుపాం నియోజకవర్గంలో గిరి శిఖర గ్రామాలకు ముందుగా రహదారులు నిర్మించేందుకు కృషి చేస్తా. ట్రైకార్ సేవలు పునరుద్ధరించే దిశగా చర్యలు చేపడతాం. అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లకు పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తాం. ట్రైకార్ ద్వారా రాయితీపై రుణాలు అందిస్తాం. గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుకు కృషి చేస్తాం.

గ్రామాల అభివృద్ధికి కృషి

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, రహదారులు, డ్రైన్ల నిర్మాణంతో పాటు తాగునీటి సౌకర్యాన్ని మెరుగుపరుస్తాం. వైసీపీ ఐదేళ్లలో మౌలిక సదుపాయాల కల్పనను నిర్లక్ష్యం చేసింది. గిరిజన గ్రామాల్లో సౌర విద్యుత్ తాగునీటి పథకాల ఏర్పాటుకు కృషి చేస్తాం.

పూర్ణపాడు- లాబేసు వంతెన పూర్తి

టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నాగావళి నదిపై పూర్ణపాడు - లాబేసు వంతెన పూర్తికి చర్యలు చేపడతాం. ఇప్పటికే ఈ వంతెనను వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. గత తెలుగుదేశం ప్రభుత్వం చేపట్టిన నిర్మాణ పనులను పూర్తి చేసి 32 గిరిజన గ్రామాలకు రాకపోకలను సులభతరం చేస్తాం. గిరిజన గ్రామాల్లో గెడ్డలపై చెక్‌డ్యాముల నిర్మాణానికి ప్రాధాన్యం కల్పించి రైతులకు సాగునీరందేలా చర్యలు తీసుకుంటాం.



కురుపాం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి తోయక జగదీశ్వరి



విజయనగరం మండలంలో టీడీపీ శ్రేణులతో ప్రచారం చేస్తున్న అదితి గజపతిరాజు

కూటమి అభ్యర్థుల విస్తృత ప్రచారం

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. పల్లెల్లో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ఆదివారం వివిధ నియోజకవర్గాల అభ్యర్థులు ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వీరి ప్రచారానికి జనం నుంచి కూడా మంచి స్పందన లభిస్తోంది. మక్కువ మండలంలో గుమ్మిడి సంధ్యారాణి, వీరఘట్టం మండలంలో కళా వెంకటరావు, జయకృష్ణ, డెంకాడ మండలంలో నాగమాధవి ప్రచారం చేశారు. కొమరాడ మండలంలో తోయక జగదీశ్వరి, సంతకవిటి మండలంలో కోండ్రు మురళి, విజయనగరం మండలంలో అదితి గజపతిరాజు తదితరులు పార్టీ శ్రేణులతో కలసి ప్రచారం చేశారు..



వీరఘట్టం: బిటివాడలో మాట్లాడుతున్న చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కళా వెంకటరావు, పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి జయకృష్ణ



బలిజిపేట: ప్రచారంలో విజయ సంకేతం చూపిస్తున్న పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి విజయచంద్ర



మక్కువ: పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న సాలూరు టీడీపీ ఎమ్మెల్యే



సంతకవిటి మండలంలో కోండ్రు మురళి ప్రచారం



డెంకాడ: అభివాదం చేస్తున్న నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి నాగమాధవి

మహిళల రక్షణకు పాటు పడే వారికే ఓటు



పాలకొండ: ప్రస్తుతం రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైంది. త్వరలో జరగనున్న ఎన్నికల్లో మహిళల రక్షణతో పాటు అన్ని రకాలుగా ప్రాధాన్య మిచ్చే వారికే నా తొలి ఓటు వేస్తాను. అభివృద్ధిపై దృష్టి సారించే పాలకులను ఎన్నుకోవాలి. అప్పుడే రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుంది.

- కె.భవానీ, పాలకొండ, పార్వతీపురం మన్యం జిల్లా

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించే వారికే..



పాలకొండ: రాష్ట్రంలో నిరుద్యోగ యువత సమస్యలు పరిష్కరించే వారికే నా తొలి ఓటుతో ప్రాధాన్యమిస్తాను. ప్రస్తుతం రాష్ట్రంలో యువతీ యువకులు నిరుద్యోగంతో మగ్గిపోతున్నారు. **- కనపాక చంద్రశేఖర్, పాలకొండ**

సమస్యలు పరిష్కరించే నాయకుడికే..



గరుగుబిల్లి: ప్రజా సమస్యలను పరిష్కరించే నాయకుడు కావాలి. గ్రామాల అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించాలి. గెలిచిన తరువాత ప్రజలను పట్టించుకోని స్థితిలో చాలామంది ఉన్నారు. వీరి బాటలో కాకుండా బాధ్యతా యుతంగా వ్యవహరించి ప్రజల మన్ననలను పొందాలి.

- పి.మురళి, మరుపెంట, గరుగుబిల్లి మండలం

జీవితంలో తొలిసారి ఓటు వేసే రోజు ప్రతి ఒక్కరికీ మరపురాని అనుభూతి. ఆ రోజును ఎప్పటికీ మరచిపోలేరు. నెత్తురు మండే.. శక్తులు నిండే యువత... నిస్వార్థం గా ఓటు వేస్తారనడంలో సందేహం లేదు. ఈ నేపథ్యంలో తొలిసారి ఓటు హక్కు పొందిన వారు ఎలాంటి వ్యక్తులను తమ నాయకులుగా ఎన్నుకోవాలనుకుంటున్నారో... ఎలాంటి సంక్షేమం కోరుకుంటున్నారో... చూద్దాం రండి.

యువగళం.. జనహితం



- ఉపాధికి.. అభివృద్ధికే మా ఓటు
- దీర్ఘకాలిక ప్రయోజనాలు కల్పించాలి
- తాత్కాలిక సాయాలు వద్దు
- ఇదీ కొత్త ఓటర్ల అభిప్రాయం

ఉపాధిని ఆశిస్తున్నాం...



గరుగుబిల్లి: యువతీ యువకులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే వారికే ఓటు వేయాలని నిర్ణయించుకున్నా. తొలిసారిగా ఓటు పొందినందుకు ఎప్పుడెప్పుడు ఓటు వేయాలా అని ఉంది. కొత్తగా ఎన్నికయ్యే ప్రభుత్వం నుంచి విద్యా సౌకర్యాలు, మెరుగైన ఉపాధి అవకాశాలు ఆశిస్తున్నాం. హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయకుంటే ఉద్యమిస్తాం.

- కండేన సాహితి, సాంబన్నవలస

దార్శనికులకే ప్రాముఖ్యం



మెంటాడ: ఓటు బ్యాంకు రాజకీయాలు కాకుండా రాష్ట్ర భవిష్యత్తుకు బాటలు వేసేవారు రావాలి. ముందుచూపుతో వ్యవహరించాలి. అభివృద్ధి, సంక్షేమం రెంటికీ సమ ప్రాధాన్య మివ్వాలి. అన్ని వర్గాల ప్రజల జీవన ప్రమాణాలు పెరిగేలా దూర దృష్టితో ఉండాలి. శాంతిభద్రతలు కాపాడాలి. అలాంటి వారినే ఎన్నుకుంటాం. ఉచితాలు తగ్గించి.. ఆర్థిక వనరులు పెంపొందించే విజనరీ కావాలి.

- సీహెచ్ రంజిత్ కుమార్, పిట్టాడ

ఓటు హక్కు ఉన్న వారికి గౌరవం



బొబ్బిలి: ఎన్నికల సమయంలో ఓటు హక్కు ఉన్నవారిందరికీ మంచి గౌరవం ఉంటుంది. రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కుకు ఇంత విలువ ఉంటుందనేది నాకు ఇప్పుడే తెలిసింది. నేను గుడ్డిగా ఎవరికీ ఓటు వేయబోను.చదువుకున్న యువతీ యువకులకు ఏ పార్టీ పాలనలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్న భరోసా ఉంటుందో ఆ పార్టీకే ఓటేస్తాను.

- మార్పు రమ్య, డిగ్రీ, ఇందిరమ్మకాలనీ, బొబ్బిలి

అవినీతిని రూపుమాపే వారికే...



గరుగుబిల్లి: నా ఓటును నోటుకు అమ్ముకోను. మెరుగైన పాలన కావాలంటే ఓటు ద్వారానే సాధ్యమవుతుంది. పురోగతి సాధించాలంటే యువ నాయకత్వం కావాలి. అవినీతిని రూపుమాపే నాయకునికే ఓటు వేస్తాను.

- ఎ.శశికుమార్, గరుగుబిల్లి

ప్రజలతో కలసి ఉండే వారికే...



రామభద్రపురం: నాకు మొదటిసారిగా ఓటు హక్కు వచ్చింది. ఈసారి ఎన్నికల్లో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే నాయకుడినే ఎన్నుకోవాలని అనుకుంటున్నాను. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలపై దృష్టి సారించి అయిదేళ్లు ప్రజలతో కలిసుండే విధంగా నాయకుడు ఉండాలన్నది నా అభిమతం. ఇప్పటికీ పల్లెల్లో ఎన్నో సమస్యలు ఉన్నాయి. వాటిని పరిష్కరించాలి. ఎమ్మెల్యేగానీ, ఎంపీ అభ్యర్థులుగా పోటీచేసే వారికి డిగ్రీ అర్హత ఉండాలనేది నా ఉద్దేశం.

- మామిడి రమేష్, ఆరికతోట

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే వారికే..



పాలకొండ: ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే వారికి తొలి ఓటు వేస్తాను. తొలిసారి ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం రావడం ఆనందంగా ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఆచితూచి యువత ఓటు వేయాలి.

- కోట జగదీష్, ఓని, పాలకొండ మండలం

నిజాయితీపరులకే తొలి ఓటు



సాలూరు రూరల్: నిజాయితీగా పాలించే వారికే నా తొలి ఓటు. తొలిసారిగా ఓటు హక్కు పొందడం ఆనందంగా ఉంది. రాష్ట్రం సత్వరం అభివృద్ధి చేసే నేతకు ఓటు వేస్తాను. రాష్ట్రం ఆర్థిక వృద్ధిని సాధించాల్సి ఉంది. ఇందుకు సత్తా ఉన్న నేతను ఎన్నుకోవాలి. అందుకు నా తొలి ఓటును సమర్థులకే వేస్తాను.

- నులకల రాహుల్‌సాయి, సాలూరు

అభివృద్ధి చేసే వారికే...



సాలూరు రూరల్: రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే వారికే నా తొలి ఓటు వేస్తాను. రాష్ట్ర పరిస్థితి గురించి అవగాహన ఉంది. అందువల్ల నా తొలి ఓటు అభివృద్ధి కోసం వినియోగిస్తాను. ప్రతి ఒక్కరు ఓటును వినియోగించుకొని అభిప్రాయం చెప్పాలి. ఓటే ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మ.

- డబ్బి మురళీకృష్ణ, సాలూరు

పరిశ్రమలను ప్రోత్సహించాలి



మెంటాడ: యువత, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు పెంచాలి. పాలనలో జవాబుదారీతనం ఉండాలి. రాష్ట్రం అభివృద్ధి జరగాలి. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి. అలాంటి వారికే మా తొలి ఓటు.

- చప్ప గణేష్, పిట్టాడ గ్రామం

యువతకు మేలు చేసే వారికి...



పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: నేను మొట్టమొదటిసారిగా ఓటు వచ్చిన తర్వాత అసెంబ్లీ నియోజకవర్గానికి, పార్లమెంట్ నియోజకవర్గానికి ఓటు వేస్తున్నాను. ఆనందంగా ఉంది. యువతకు ఉపాధి కల్పించడం... రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే విధంగా పాలకులు ఉండాలి.

- టి.మణి, ఎల్ఎన్‌పురం, పార్వతీపురం

ఉద్యోగావకాశాలు కల్పించే వారికే..



భోగాపురం: నేను మొదటి సారిగా ఓటు హక్కు ఉపయోగించుకుంటున్నందుకు ఏదో సాధిస్తున్నాం అన్నట్లుగా అనిపిస్తోంది. గ్రామానికి మంచి చేసేవారికి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలిగించే వారికి ఓటు వేయాలనుకొంటున్నాను. ఉపాధి అవకాశాలు, ఉద్యోగాలు యువతకు ప్రధానం. ఉపాధి కల్పించేలా ప్రభుత్వాలు చూడాలి.

- ఎరుబోతు గణేష్, లింగాలవలస గ్రామం

పరిశ్రమలు తేచ్చే వారికే తొలి ఓటు



సాలూరు రూరల్: సాలూరు నియోజకవర్గంలో ఎటువంటి పరిశ్రమలూ లేవు. నియోజకవర్గంలో పరిశ్రమలు తెచ్చే సమర్థత ఉన్నవారికే తొలి ఓటు వేస్తాను. నియోజకవర్గంలో వనరులు ఉన్నాయి. వాటితో పరిశ్రమలు నెలకొల్పి యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి చొరవ చూపే నేతకు ఓటు వేయదలిచాను. అప్పుడు ప్రజాస్వామ్యం బలోపేతం అవుతుంది.

- ఎన్.రాహుల్, సాలూరు

అభివృద్ధి చేయగల వారికే...



సాలూరు రూరల్: తొలి ఓటును సద్వినియోగం చేసుకోవాలి. తొలిసారిగా ఓటు రావడం ఉద్వేగంగా ఉంది. పరిస్థితులు అవగాహన చేసుకోవాలి. మనకు ఏ నేత వల్ల పనులు జరుగుతాయో గుర్తిస్తాను. ఎవరి వల్ల అభివృద్ధి జరుగుతుంతో వారికే ఓటు వేస్తాను.

- ఎన్.జీవన్, సాలూరు

ఉపాధికి ఊతమిచ్చే వారికే...



లక్కవరపుకోట: నాకు కొత్తగా ఓటు వచ్చినందుకు ఆనందంగా ఉంది. నా చదువుకు తగ్గట్టుగా ఫార్మా కంపెనీలో ఉద్యోగం వచ్చింది. ఉద్యోగ, ఉపాధితో రాష్ట్రాభివృద్ధి చేసేవారికే నేనే ఓటు వేస్తాను.

- ఎ.హరిక, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ

ఉద్యోగాలు కల్పించే వారికి..



గుమ్మలక్ష్మీపురం: యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన అవసరం ప్రభుత్వాలకు ఉంది. అటువంటి హామీలు ఇచ్చిన ప్రభుత్వాలను మేం ఎన్నుకుంటాం. యువతకు పథకాల వల్ల ఒరిగింది ఏమీ లేదు. వృత్తి నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పన కార్యక్రమాలు జరిగినప్పుడే యువతకు మేలు జరుగుతుంది.

- ఎం.నీలిచంద్, డిగ్రీ, గుమ్మలక్ష్మీపురం

సమస్యలను పరిష్కరించగలిగే వారికే..



భామిని: యువత ఉపాధికి చేయూత అందించే నాయకునికే ఓటు వేయాలని మా లక్ష్యం. ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించుకొనే నాయకుడే కావాలి. గ్రామ, మండల, నియోజకవర్గ సమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో లేవనెత్తి పరిష్కరించే విధంగా నాయకుడు చొరవ చూపగలగాలి.

- చీకటింటి ఝాన్సీ, బీటెక్ విద్యార్థిని, భామిని

గ్రామాభివృద్ధికి సహకరించే వారికి..



మక్కువ: కొత్తగా ఓటు వచ్చినందుకు ఆనందంగా ఉంది. ఎన్నికల తేదీ వచ్చేంత వరకు ఆతృతగా ఎదురు చూస్తున్నా. ఎన్నికల్లో గెలుపొందిన నాయకులు, అభివృద్ధి సంక్షేమంపై దృష్టిసారించాలి. యువతకు ఉద్యోగాల కల్పనకు కృషి చేయాలి. గ్రామాల అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకరించాలి.

- గెంబలి ఆదిత్య, మక్కువ

ఓటు అమూల్యమైనది



బొబ్బిలి: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు ఎంతో అమూల్యమైంది. మంచి నాయకులను గెలిపించుకోవాలి. కులం, మతం, ప్రాంతం, లింగ వివక్ష వంటి వాటిని రాజకీయాల్లో ప్రబలకుండా అందరూ అభ్యుదయం వైపే పయనించాలి. అలాంటి పార్టీలకు, నాయకులకే నేను నిర్భయంగా ఓటు వేస్తాను.

- పట్నాల శ్యామ్‌కుమార్, డిగ్రీ, బొబ్బిలి

దండాలయ్యా.. దండాలు

- పాదయాత్రలు... పలకరింపులు
- ప్రచారంలో తలమునకలు

(రాజాం రూరల్)

ఎండలు మండుతున్నాయి.. వేడిగాలులు హోరెత్తిస్తున్నాయి.. అదే సమయంలో ఎన్నికల వేడి కూడా ప్రజలను ఊపిరాడనివ్వడం లేదు. ఉదయం ఓ పార్టీ అభ్యర్థి వస్తే... రెండో పూట మరో అభ్యర్థి.. ఇలా ఒకరి వెంట మరొకరు.. నాయకుల ప్రచారంతో ప్రజలు కూడా ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.. ప్రచార రథాలకు అమర్చిన మైకులు హోరెత్తిస్తున్నాయి. అధికార, కూటమి పార్టీలకు చెందిన అభ్యర్థులతో పాటు ఇతర పార్టీల వారూ ప్రస్తుతం ప్రచారంలో తలమునకలై ఉన్నారు. దండాలయ్యా.. దండాలయ్యా.. మాతోనే మీరు ఉండాలయ్యా అని ఓ సినిమాలోని పాటను ఎత్తుకుంటున్నారు.

సందడే సందడి..

చిన్న చిన్న గ్రామాలను ఉదయం పూట.. పెద్ద గ్రామాలను సాయంత్రం వేళల్లో ప్రచారానికి ఎంచుకుంటున్నారు. ప్రచార రథాలపై వీధుల్లో తిరుగుతున్నారు. పట్టణాల్లోని వీధుల్లో పాదయాత్ర ద్వారా ఇంటింటా ప్రచారం చేస్తున్నారు.

వ్యూహాల్లో తలమునకలు..


ఒక పార్టీపై మరో పార్టీ పైచేయి సాధించుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. వ్యూహాలు ప్రతి వ్యూహాలు రచిస్తున్నారు. గతంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ... మరింత అభివృద్ధి తమ నేతతోనే సాధ్యమని... తమ అభ్యర్థిని గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. కొత్తగా ఎన్నికల బరిలోకి దిగిన వారైతే...తమకు ఓ అవకాశం ఇచ్చి చూడాలని కోరుతున్నారు.

పూజలు..

గ్రామాలకు వెళ్లినపుడు స్థానికంగా ఉన్న ఆలయాలకు వెళ్లి అభ్యర్థులు పూజలు చేస్తున్నారు. స్థానిక నాయకులు వారితో ఆలయాలలో పూజలు చేయించేందుకు ఎక్కువగా ఉత్సాహాన్ని కనబరుస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి..

ఓ వైపు తమ మేనిఫెస్టోలలోని అంశాలను ఏకరవు పెడుతూ...మరోవైపు స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని హామీలు ఇస్తున్నారు. మొత్తానికి ఈ దండాలు ఎవరికి వరమవుతాయో...ఎన్నికల ఫలితాలు వస్తేగానీ తెలియదు.



ఎమ్మెల్యే వచ్చేసరికి రాజీనామా చేయాల్సిందే!

- వలంటీర్లకు వైసీపీ నాయకుల హుకుం



రాజీనామా చేసిన లోట్లపల్లి పంచాయతీ వలంటీర్లు

జామి, మే 5: 'ఈ ఉద్యోగం మీరు చదివిన చదువు వల్ల మీకు రాలేదు.. మీరంతా ఈ ఉద్యోగం రాక ముందు వైసీపీ కార్యకర్తలు. జిల్లా అంతటా వలంటీర్లు రాజీనామాలు చేస్తుంటే... మీరు ఎన్నికలు సమీపిస్తున్నా... ఇంకా రాజీనామాలు చేయడం లేదు. రెండు రోజుల్లో ఎమ్మెల్యే మన గ్రామానికి ప్రచారానికి వస్తున్నారు. ఈలోగా మీరు రాజీనామా చేయాలి. లేదంటే మేము ఏం చేయాలో అది చేస్తాం..' ఇదీ మండలంలోని వైసీపీ నేతల మాట. ఇవే మాటలు మండలంలోని లొట్లపల్లి పంచాయతీలో వినిపించాయి. దీంతో విధుల్లో ఇంకా కొనసాగుదాం అనుకున్న వలంటీర్లు తప్పనిసరి స్థితిలో బలవంతంగా రాజీనామాలు చేసి... గ్రామ పంచాయతీ కార్యదర్శికి లేఖలు సమర్పించారు. ఇదేవిధంగా గోడికొమ్ములోనూ హెచ్చరికలు రావడంతో వలంటీర్లు రాజీనామాలు చేశారు. మూడు రోజుల క్రితం ఎస్.కోటలో నిర్వహించిన నియోజకవర్గ సమావేశంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు చిన్న శ్రీను వలంటీర్లతో రెండు రోజుల్లో రాజీనామాలు చేయించాలని ఎమ్మెల్యేతో పాటు మండలాల ముఖ్య నాయకులపై ఒత్తిడి తెచ్చారు. దీని ఫలితమే ఇదని అంటున్నారు. ఈ బలవంతపు రాజీనామాలపై గడిచిన ఐదేళ్లుగా సేవలు అందించిన వలంటీర్లు తీవ్రంగా మధన పడుతున్నారు. తాము రాజీనామాలు చేయకుండా ఉంటే.. టీడీపీ ప్రభుత్వంలో నెలకు రూ.పదివేలు జీతం వచ్చేదని అంటున్నారు. తాము రాజీనామాలు చేయడం వల్ల ఆ అవకాశం కోల్పోతున్నామని సన్నిహితుల వద్ద వలంటీర్లు వాపోతున్నట్టు తెలిసింది.

ఒకటొకటిగా పథకాలు రద్దు

- బ్రాహ్మణులకు వైసీపీ ప్రభుత్వం ఇబ్బందులు

(గరుగుబిల్లి)

రాష్ట్రంలో 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి.. అంతకుముందు టీడీపీ హయాంలో అమలు చేసిన అనేక పథకాలను రద్దు చేస్తూ వచ్చింది. దీనివల్ల వివిధ సామాజిక వర్గాల వారితో పాటు వేలాది మంది లబ్ధిదారులు నష్టపోయారు.

- గత టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా బ్రాహ్మణుల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేసింది. ప్రస్తుత ప్రభుత్వం కొంతకాలంగా ఒకటొకటిగా వాటిని రద్దు చేయడం లేదా అమలు చేయకుండా కాలయాపన చేసింది.
- గత టీడీపీ హయాంలో బ్రాహ్మణ కుటుంబాల్లోని వృద్ధులకు కార్పొరేషన్ ద్వారా వృద్ధాప్య పింఛను లభించేది. ఒక కుటుంబంలో ఇద్దరు లేక ముగ్గురు వృద్ధులు ఉన్నప్పటికీ అందరికీ పింఛను వచ్చేది.
- జగన్ ప్రభుత్వం ఒక కుటుంబంలో కేవలం ఒకరికే పింఛను అంటూ కోత పెట్టటమే కాకుండా ఆ ఒకరికి కూడా కార్పొరేషన్ ద్వారా కాకుండా సామాజిక పింఛను పథకానికి మార్పు చేశారు. ఈ క్రమంలో గతంలో పింఛను పొందుతున్న అనేకమంది బ్రాహ్మణ వృద్ధుల పేరు సామాజిక పింఛను పథకంలో కనిపించకుండా పోయి వారు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- గత టీడీపీ హయాంలో వయసుతో నిమిత్తం లేకుండా భర్తను కోల్పోయినా లేదా భర్త వదిలేసిన ఒంటరి బ్రాహ్మణ మహిళలకు సైతం నెలవారీ పింఛను కార్పొరేషన్ ద్వారా అందేది. వైసీపీ ప్రభుత్వ ఆ పింఛను సైతం నిలుపుదల చేసింది.



- విదేశాలకు వెళ్లి చదువుకోవాలనుకునే బ్రాహ్మణ విద్యార్థులకు కార్పొరేషన్ ద్వారా గతంలో ఆర్థిక సాయం అందేది. వైసీపీ ప్రభుత్వం దానిని సైతం నిలిపివేసింది.
- బ్రాహ్మణులు చనిపోయినప్పుడు అంత్యక్రియల ఖర్చుల కోసం గరుడ పథకం ద్వారా ఆర్థిక సాయం అందజేసే విధంగా గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అప్పట్లో ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్న పది నుంచి పదిహేను రోజుల్లో రూ. 10 వేలు నేరుగా చనిపోయిన వ్యక్తి వారసులకు అందేవి.
- ప్రస్తుతం ఈ పథకం కింద దరఖాస్తు చేసుకుని జిల్లాలో అనేకమంది నెలల తరబడి ఎదురు చూస్తున్నారు.
- కారు వంటి నాలుగు చక్రాల వాహనాలు కొనుగోలు చేసుకుని దానిని అద్దెకు తిప్పటం ద్వారా స్వయం ఉపాధి పొందే విధంగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కార్పొరేషన్ ద్వారా బ్రాహ్మణ యువతకు రుణాలు ఇచ్చారు.
- వైసీపీ ప్రభుత్వ హయాంలో అది అమలు కావటం లేదు. ఇలా అనేక పథకాలను నిలిపివేసింది.



బటన్ నొక్కి బోల్తా కొట్టించారు: జయకృష్ణ


దిగువ దారబలో జనసేనలో చేరినవారితో జయకృష్ణ

సీతంపేట: జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కి ప్రజలకు బోల్తా కొట్టించారని, ఈ విషయాన్ని గుర్తించి ప్రజలు వైసీపీని ఇంటికి పంపించడానికి సిద్ధంగా ఉన్నారని కూటమి పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి జయకృష్ణ అన్నారు. పెద్దవంగర, ఎగువదారబ, దిగువ దారబ గ్రామాల్లోని వైసీపీకి చెందిన సుమారు 120 కుటుంబాలు ఆదివారం జనసేన పార్టీలో చేరారు. వీరికి జయకృష్ణ పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఎంపీటీసీ సవర తిరుపతిరావు, సరవ పెద్దనాగేశ్వరరావు, సవర హరీష్, సవర రవి, సవర సూర్యారావు, తదితర కుటుంబాలు ఉన్నాయి. కూటమి నాయకులు సవర తోట ముఖలింగం, మండంగి విశ్వనాథం, ఆరిక అమల, హిమరిక పవన్ పాల్గొన్నారు. ● **వీరఘట్టం:** బిటివాడలో మాజీ మంత్రి కిమిడి కళా వెంకటరావు జయకృష్ణకు మద్దతుగా ఆదివారం ప్రచారం నిర్వహించారు. కూటమిలో చేరిన సర్పంచ్ శ్రీరామ్‌నరసింహులును ఆయనకు కండువా వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, ఉదయాన ఉదయ్‌భస్కర్, గర్భాన సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. ● **భామిని:** జయకృష్ణకు మద్దతుగా తోటపల్లి మాజీ ఛైర్మన్ నిమ్మక పాండురంగ.. వడ్డంగి, గురండి, నేరడి గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. ● **వీరఘట్టం:** పనసనందివాడ, మొట్టవెంకటాపురం, కుమ్మరిగుంట గ్రామాల్లో జనసేన రాష్ట్ర పరిశీలకుడు కొరికాన రవికుమార్, కూటమి అభ్యర్థి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి భారీ సంఖ్యలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. పనసనందివాడ సర్పంచ్ కొరికాన సన్యాసినాయుడుతో పాటు ఆ గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలంతా జనసేన తీర్థం పుచ్చుకున్నారు. మెట్టవెంకటాపురం, కుమ్మరిగుంట గ్రామాల నుంచి వందల సంఖ్యలో జనసేనలో చేరారు. టీడీపీ నాయకులు పొదిలాపు కృష్ణమూర్తి, ఉదయాన ఉదయ్‌భాస్కర్, కర్నేన అప్పలనాయుడు పాల్గొన్నారు. ● **పాలకొండ:** కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ బీజేపీ నాయకులు టంకాల దుర్గారావు, కారెపు చిట్టిబాబు, కుమార్‌రాజా, చుక్కా మహాలక్ష్మి, మృత్యుంజయరావు ఆదివారం గొట్ట మంగళాపురంలో ప్రచారం చేశారు.

వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపిద్దాం

● కూటమి పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి విజయచంద్ర


జగన్నాథపురంలో ప్రచారం చేస్తున్న విజయచంద్ర

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపిద్దామని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయచంద్ర అన్నారు. జిల్లా కేంద్రం జగన్నాథపురంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా రాగోలు గంగరాజు ఆధ్వర్యంలో సుమారు వంద కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరందరికీ ఆయన టీడీపీ కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. కష్టపడి పనిచేసిన ప్రతిఒక్కరికీ పార్టీ గుర్తింపు ఉంటుందన్నారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వంతో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు. ● కూటమి పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయచంద్ర విజయం కోసం ఆయన సతీమణి అనూష జిల్లా కేంద్రంలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు మహిళల పక్షపాతి అన్నారు. ఈ ప్రచారంలో కూటమి నాయకులు ద్వారపురెడ్డి శ్రీదేవి, మజ్జి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ● **బలిజిపేట:** కూటమి పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయచంద్ర అజ్జాడ గ్రామంలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతవరకు వైసీపీని నమ్మి మోసపోయారు.. ఇప్పుడు సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించండి.. అభివృద్ధి అంటే ఎంటో చేసి చూపిస్తా అన్నారు. ఈ ప్రచారంలో టీడీపీ నేత కిమిడి నాగార్జున పాల్గొని, మాట్లాడారు. సైకిల్ జోరు పెరిగిందని, మీ అమూల్యమైన ఓటు సైకిల్ గుర్తుపై వేసి, మరింత జోరు పెంచాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పి.వేణునాయుడు, అజ్జాడ సర్పంచ్ అక్కినేని జగన్‌మోహన్‌రావు, ఎంపీటీసీ అక్కినేని గణేష్, 24 పంచాయతీల సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీతోనే మహిళల అభ్యున్నతి

● కూటమి కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వరి


ప్రచారంలో పాల్గొన్న కూటమి అభ్యర్థి జగదీశ్వరి, వీరేష్ చంద్రదేవ్

కొమరాడ: మహిళల అభ్యున్నతికి పాటుపడిన పార్టీ టీడీపీయేనని కూటమి కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని శివిని, విక్రాంపురం, మార్కొండపుట్టి పంచాయతీల్లో ఆమె ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా అభ్యున్నతికి కోసం టీడీపీ సూపర్ సిక్స్ పథకాలు తీసుకొచ్చిందని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు మూడు గ్యాస్ సిలెండర్లు, 18 ఏళ్లు నిండిన వారికి రూ.1500 అందించే పథకాలను చంద్రబాబు ప్రవేశపెట్టారని ఆమె వివరించారు. ఈ ప్రచారంలో ఆమె తోపాటు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరేష్ చంద్రదేవ్ పాల్గొని మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపే సమయం వచ్చిందన్నారు. ఈనెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి జగదీశ్వరిని గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి టీడీపీ మండల కన్వీనర్ శేఖర్‌పాత్రుడు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త కద్రక మల్లేష్, కూటమి నాయకులు, పి.వెంకటనాయుడు, డి.వెంకటనాయుడు, ఎం.రాము, పి.పాపినాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు సంతోషి, త్రినాథం, మధుసూదనరావు, సుదర్శనరావు, మండల జనసేన, బీజేపీ కన్వీనర్లు శ్రీకర్, డి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాల పరిశీలన


ఉద్యోగులకు అభివాదం చేస్తున్న కూటమి ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత

పార్వతీపురం, మే5 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లాలో ఆదివారం ప్రారంభమైన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియను కూటమి అభ్యర్థులు పరిశీలించారు. జిల్లా కేంద్రం పార్వతీపురంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎస్‌వీడీ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లను టీడీపీ పార్వతీపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయచంద్ర , బీజేపీ అరకు ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత సందర్శించారు. ఈ సందర్భంగా పోలింగ్ సరళిని పరిశీలించారు. ఓట్లు వేసేందుకు వచ్చిన వారికి అభివాదం చేశారు. టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ తదితరులు ఉన్నారు. కురుపాం మోడల్ స్కూల్‌లో జరిగిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ సరళిని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరితో పాటు ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత కూడా పరిశీలించారు. వారి వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరేష్‌చంద్రదేవ్ తదితరులు ఉన్నారు.

గుమ్మలక్ష్మీపురంలో కొత్తపల్లి గీత ప్రచారం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కొత్తవలస, ఎల్.ఎల్.పురంలో కూటమి ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత ఆదివారం ప్రచారం చేపట్టారు. ఈసందర్భంగా పలువు రు వైసీపీ కార్యకర్తలు బీజేపీలో చేరారు. ఇటీవల బీజేపీలో చేరిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నిమ్మక సింహాచలం ఆహ్వానం మేరకు వీరు బీజేపీలో చేరారు. కూటమి టీడీపీ అభ్యర్థి జగదీశ్వరిని, ఎంపీగా తనను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆమె వెంట గుమ్మలక్ష్మీపురం టీడీపీ అధ్యక్షులు పాడి సుధ, పార్టీ నాయకులు వెంపటాపు భారతి, కళావతి, మండంగి భూషణ రావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఎంపీలు సమస్యలను ప్రస్తావించలేదు

● సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకారత్


మాట్లాడుతున్న బృందాకారత్

పాలకొండ: రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ ఎంపీలు పార్లమెంట్‌లో కనీసం ప్రజా సమస్యలపై మాట్లాడలేదని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు, మాజీ రాజ్యసభ ఎంపీ బృందాకారత్ అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో సార్వత్రిక ఎన్నికల ప్రచార సభలో పాల్గొని, మాట్లాడారు. వైసీపీ ఎంపీలు అధికంగా ఉన్నప్పటికీ రాష్ట్రంలోని ఏ సమస్యపై కూడా ప్రస్తావించలేదన్నారు. ప్రత్యేక హోదా, రైల్వేజోన్ తదితర అంశాలపై చర్చించలేదని ఆమె ఆరోపించారు. అరకు పార్లమెంట్ అభ్యర్థిగా సీపీఎం నుంచి పోటీ చేస్తున్న అప్పలనరసి, అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఉన్న చంటిబాబును గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో గంగరాపు సింహాచలం, దావాల రమణారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రసాదరావుకు అభినందన

పాలకొండ: అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావును బృందాకారత్ అభినందించారు. కేంద్రం ప్రవేశపెట్టిన మూడు వ్యవసాయ నల్లచట్టాలకు నిరసనగా.. తనకు ప్రభుత్వం ఇచ్చిన అవార్డులను తిరస్కరించి ఆర్డీవో కార్యాలయంలో ఇచ్చివేశారని, మళ్లీ ఆ చట్టాలను రద్దు చేసిన అనంతరం వాటిని స్వీకరిస్తానని చెప్పడం అభినందనీయమని ఆమె అన్నారు.

న్యాయానికి మద్దతుగా 'ధర్మపక్షం'

పార్వతీపురంటౌన్: అన్యాయానికి గురైన వారిని రక్షించడమే కాకుండా న్యాయానికి మద్దతుగా ధర్మపక్షం సంస్థ ఉంటుందని ఆ సంస్థ అధ్యక్షుడు చుక్క భాస్కరరావు అన్నారు. పట్టణంలో ఆదివారం ధర్మపక్షం సంస్థ ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో ధర్మం, న్యాయం పక్కదోవ పడుతున్న నేపథ్యంలో మనమంతా ఏకతాటిపై ఉండి అనాథలు, అభాగ్యులకు మన వంతుగా సహాయ సహకారాలను అందించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ప్రజలకు న్యాయం చేసే పార్టీనే గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. ఇక నుంచి ప్రతి ఆదివారం ధర్మపక్షం సంస్థ ప్రధాన కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచిత న్యాయసలహా కేంద్రం ద్వారా పేదలకు చట్టాలపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. అనంతరం సంస్థకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం

శృంగవరపుకోట రూరల్: మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన సింగిడి అప్పయ్యమ్మ(70) పదిరోజుల క్రితం గ్రామం నుంచి అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ వృద్ధురాలు పదిరోజుల క్రితం ఎస్.కోట సామాజిక ఆసుపత్రికి వెళ్లి అప్పటి నుంచి కనిపించడం లేదని, దీంతో అన్ని చోట్ల వెతికి శృంగవరపుకోట పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఎవరికైనా కనిపిస్తే 9381189100కు తెలియజేయాలన్నారు.

బీజేడీ విజయానికి కృషి చేయండి


ప్రజలతో కొండబాబు

రాయగడ: ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేడీ అభ్యర్థుల విజయానికి ప్రతి కార్యకర్త ఓ సైనికుడిలా పనిచేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు యల్లా కొండబాబు పిలుపునిచ్చారు. ఆయన అధ్యక్షతన ఆంధ్ర-ఒడిశా సరిహద్దు, కెరడ సమీపంలోని ఒత్తాడ గ్రామంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాయగడ 24 వార్డులకు చెందిన సమితి పరిధి 28 పంచాయతీలకు చెందిన సుమారు రెండు వేలమంది

ఒడిశా

హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేడీ ఎమ్మెల్యే అభ్యర్థి అనసూయా మాఝి, ఎంపీ అభ్యర్థి కౌసల్యా హికాక గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అమో ఒడిశా జిల్లా సమన్వయకర్త పి.గౌరీశంకరరావు, కాశీనాయుడు, చక్రబిడిక, పలు పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిరుజల్లులతో మొక్కజొన్న రైతుకు ఇక్కట్లు


కల్లాల్లో మొక్కజొన్న గింజలపై టార్పాలిన్లు కప్పుతున్న రైతులు

భామిని: మండలంలో ఆదివారం మెరుపులు, ఉరుములతో చిరు జల్లులు కురవడంతో రైతులు ఇక్కట్లు పడ్డారు. మండలంలోని పసుకుడి, బిల్లుమడ, సింగిడి గ్రామాల్లోని కల్లాల్లో ఉన్న మొక్కజొన్న గింజలపై రైతులు టార్పన్లు కప్పారు. చేతికందే మొక్కజొన్న గింజలు భారీ వర్షాలు పడితే నష్టం వాటిల్లుతుందని వాపోతున్నారు. ఐదు రోజులుగా నూర్పి ఎండేసి నిల్వ చేయగా కొనేవారు ఆలస్యం చేయడంతో ఈ మొక్కజొన్న పిక్కలకు కుటుంబ సమేతంగా సేవ చేసినా ఇబ్బందులు తప్పడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

బస్‌షెల్టర్ నిర్మించరూ

● నిలువ నీడ లేక ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
● బస్సుల కోసం ఎండలోనే నిరీక్షణ
● పట్టించుకోని అధికారులు, పాలకులు


మండల కేంద్రంలో బస్ షెల్టర్ లేని దృశ్యం

వీరఘట్టం: మండల కేంద్రమైన వీరఘట్టంలో ప్రయాణికులు వేచి ఉండేందుకు కనీసం సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉన్నాయి. ఈతరుణంలో ప్రయాణికులు ఎండలోనే బస్సుల కోసం ఇబ్బంది పడి వేచి చూడాల్సిన పరిస్థితి వస్తోంది. ఇక్కడ బస్సు కాంప్లెక్స్ నిర్మిస్తామని అప్పటి నాయకులు హామీనిచ్చారు. కానీ ఇప్పటికీ నెరవేరలేదు. దీంతో మండలకేంద్ర వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం బస్సు షెల్టర్ అయినా నిర్మిస్తే చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రాష్ట్రంలో కూటమి విజయం తథ్యం

● సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి సంధ్యారాణి


ప్రచారంలో మాట్లాడుతున్న సంధ్యారాణి

మక్కువ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడం తథ్యమని సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని కన్నంపేట, ఎ.వెంకంపేట, మేలాపువలస, మేలాపువలస కాలనీ, మక్కువ, కోన, గోపాలపురం, డబ్బురువలస, అంటివలస గ్రామాల్లో ఆమె ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సైకో జగన్‌కు ఒక్క చాన్స్ ఇస్తే రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో అగ్రస్థానంలో నిలిపాడన్నారు. రాష్ట్రాభివృద్ధి కావాలంటే కూటమి అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మక్కువ ప్రధాన రహదారిలో ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్తున్నామని పలువురు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. రానున్న కూటమి ప్రభుత్వంలో సమస్యలన్నీ పరిష్కరిస్తానని ఆమె హామీనిచ్చారు.

టీడీపీలో చేరికలు..

మక్కువ మండలంలోని పనసభద్ర నుంచి 150 మంది, ఎర్రసామంతవలస నుంచి 60 మంది, సాలూరు మండలం కొంజపాక నుంచి వంద మంది, మెండంగి నుంచి వంద మంది, ములక్కాయవలస నుంచి 80 మంది టీడీపీలో చేరారు. వారికి సంధ్యారాణి టీడీపీ కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ ప్రచారంలో కూటమి నాయకులు గంట అప్పలస్వామి, రాయల అప్పారావు, గుల్ల వేణుగోపాల్, పెంట తిరుపతిరావు, మత్రాపు సురేష్, మావుడి ప్రసాదరావు, గౌరీశంకర్, మల్లేశ్వరరావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఫెసిలిటేషన్ కేంద్రం పరిశీలన


కేంద్రాన్ని పరిశీలిస్తున్న పరిశీలకుడు హనీష్ చోబ్రా

గజపతినగరం: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఈవీఎం ఓటింగ్ యంత్రాల పనితీరును ఎన్నికల పరిశీలకుడు హనీష్ చోబ్రా పరిశీలించారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఫెసిలిటేషన్ కేంద్రాలతో పాటు స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని పరిశీలించా రు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 నుంచి 7వ తేదీ వరకు ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు పోస్టల్ బ్యాలెట్‌లను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే ఓటింగ్ యంత్రాల్లో అభ్యర్థుల యంత్రాలను ఏవిధంగా పొందు పరు స్తున్నది అధికా రులను అడిగి తెలుసుకున్నారు. ఓటింగ్‌కు చేసిన ఏర్పాట్లు ఓటింగ్ ప్రక్రియ, హెల్ప్ డెస్కులు, పోలింగ్ బూత్‌లపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఆర్వో ఎం.సూర్యకళ, తహసీల్దార్ సీహెచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విస్తృత వాహన తనిఖీలు


వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న దృశ్యం

విజయనగరం క్రైం, మే 5: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నేప థ్యంలో జిల్లా ఎస్పీ దీపికా ఆదేశాలతో జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్, టూటౌన్, రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధితో పాటు జిల్లా వ్యాప్తంగా ఎస్పీ దీపికా ఆదేశాలతో తనిఖీలు ముమ్మరం చేశారు. నిబంధనలు అతిక్రమించే వారిపై 140 మందిపై కేసులు నమోదు చేశారు. పోలింగు కేంద్రాలు, సమస్యాత్మక గ్రామాల్లో అనుమానితులను స్టేషన్ కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి హెచ్చరించి పంపిస్తు న్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవా లని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. నగర శివార్ల లోని వీటి అగ్రహారం, మోదవలస, జమ్మునారాయణపురం, నెల్లిమర్ల మిమ్స్, ఎస్‌కోట, గజపతినగరం రహదారుల్లో తనిఖీల కేంద్రం ఏర్పా టు చేసి ప్రతి వాహనాన్ని పరిశీలించి రికార్డులో నమోదు చేసుకు న్నారు. ట్రాఫిక్ పోలీసులు ప్రతి వాహనాన్ని ఆపి పెండింగ్ ఈ చలానాలను చెక్ చేసి పెండింగ్ ఉంటే చెల్లించిన తరువాతనే వాహనాలను వదిలిపెడుతున్నారు.

కార్ల్‌మార్క్స్‌కు నివాళి


కార్ల్‌మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

గజపతినగరం: స్థానిక శాఖా గ్రంథాలయ ఆవరణలో ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో కార్ల్‌మార్క్స్ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు శ్రీనివాస్, రాకోటి రాములు మాట్లాడుతూ కార్ల్‌మార్క్స్ భౌతికంగా లేనప్పటికీ ఆయన ఆశయాలు, సిద్ధాంతాలు ముందుకు తీసుకుపోయేవారిలో సజీవంగానే ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో హరికృష్ణ, వేణి, రాము పాల్గొన్నారు.

ఎస్.కోటలో శేషగిరి వర్ధంతి


శేషగిరికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

శృంగవరపుకోట: శృంగవరపుకోట పట్టణంలో యూటీఎఫ్ నేత కామ్రేడ్ శేషగిరి వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఉపాధ్యాయుల సమస్యలకోసం అలుపెరగని పోరాటం చేశారని యూటీఎఫ్ నాయకులు జీ.వి.రమణ, గేదల బంగారు నాయుడు కొని యాడారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎం.వి.ఎస్ నారాయణ, ఆశపు శ్రీనివాస్, ఎం.కొండలరావు, జె.శ్రీరామూర్తి, సీహెచ్ సర్వదేముళ్లు తదితరులున్నారు.

ఓటర్లకు అవగాహన


ర్యాలీ చేస్తున్న ఆశయ సభ్యులు

చీపురుపల్లి: వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకో వాలని ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ విజ్ఞప్తి చేశారు. ఆదివారం మెట్టపల్లిలో ఆ సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటును నిర్లక్ష్యం చేయకూడదన్నారు. ఈ ర్యాలీలో సంస్థ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లల్లో భక్తిభావం నింపాలి

రేగిడి: భగవాన్ సాత్యసాయిబాబా ఆశయాలు, సేవాతత్పరత పిల్లలకు స్ఫూర్తి కావాలని ఏపీ సత్యసాయి సేవాసంస్థల ఆధ్యాత్మిక సమన్వయకర్త తోట అరుణకుమారి అన్నారు. మండలంలో రేగిడి విశ్వసాయి మందిరంలో నిర్వహిస్తున్న సత్యసాయి వేసవి వెన్నెల తరగతుల శిక్షణ శిబిరాన్ని ఆదివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక విశ్వసాయి మందిరం సాయికీర్తనలతో మార్మోగింది. రేగిడి మందిర ధర్మకర్త హైకోర్టు న్యాయవాది మామిడి వేణుగోపాలరావు, రాజాం డివిజన్ సత్యసాయి జోనల్ కన్వీనర్ కరణం రామకృష్ణ, సాయికమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆధ్యాత్మిక సమన్వయకర్త అరుణకుమారి

ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

వీరఘట్టం: ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్ఐ ఫక్రుద్దీన్ సూచించారు. తలవరం గ్రామంలో ఆదివారం పోలీసు కవాతు నిర్వహించారు. అనంతరం గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఓటు హక్కును ప్రశాంతంగా వేయాలన్నారు. ఎటువంటి తగాదాల్లో యువత తలదూర్చవద్దన్నారు. ఎటువంటి అల్లర్లకు పాల్పడినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రమదానంతో గోతులు పూడ్చివేత

వీరఘట్టం: మండలంలోని వండువ సెంటర్ నుంచి తలవరం సెంటర్ వరకు పార్వతీపురం- పాలకొండ రహదారి గోతులమయంగా మారింది. దీంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఆటోలు, వాహనాలు మరమ్మతులు గురికావడంతో ఆటో డ్రైవర్లు సంగమేశ్వర, జగ్గారావు ముందుకొచ్చి ఆదివారం ఆ గోతులను పూడ్చారు. వారిని పలువురు వాహనదారులు అభినందించారు.


గోతులు పూడ్చుతున్న దృశ్యం

